ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-గుంటూరు : ప్రతి పేదవాడికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో నిరంతరం ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రైమ్ హాస్పిటల్ చైర్మన్ దేగల ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్‌లో ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుంటూరు రూరల్ పరిధిలోని చిన్న పలకలూరులో ఉచిత మెగా వైద్య శిబిరంలో నిర్వహిస్తున్నట్లు ప్రభాకర్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అనుభవిజ్ఞులైన జనరల్ మెడిసిన్, ఆర్థోపెటిక్, న్యూరాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, పీడియాట్రీషియన్, పలమనాలజిస్ట్, స్త్రీల ప్రసూతి విభాగం ఇతర రుగ్మతలకు సంబంధించిన స్పెషాలిటీ డాక్టర్స్ చిన్న పలకలూరుకు విచ్చేసి ప్రజలకు ఉచితంగా అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. గ్రామ ప్రజలు ప్రతిఒక్కరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- తృటిలో తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నగర పరిధిలోని చినకాకాని గ్రామం వద్ద హైవే నుంచి ఆర్టీసీ బస్సు డివైడర్‌కు ఢీకొని దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్పగాయాలు అయ్యాయి. గుంటూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్తుండగా మంగళగిరి సమీపం లోని చినకాకాని గ్రామం వద్ద బైపాస్ రోడ్‌లో వెళ్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. డ్రైవర్ సమయస్ఫూర్తిగా బస్సు నిలిపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులో 35 మంది ప్రయాణీ కులు ఉన్నారు. డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో కొందరికి స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాద స్థలాన్ని సందర్శించిన మంగళగిరి రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్ ప్రమాదానికి గల కారణాలను బస్సు డ్రైవర్‌ని అడిగి తెలుసుకున్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి

విశాలాంధ్ర- తెనాలి : సీపీఎం తెనాలి ఏరియా కమిటి ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ ఆదివారం స్థానిక చెంచుపేటలోని సీపీయం పార్టీ కార్యాలయంలో జరిగింది. పి.జోసేష్ అధ్యక్షత వహించారు. తెనాలి కమిటి కార్యదర్శి కొల్లి పర బాబూప్రసాద్ మాట్లాడుతూ 194 4వ సంవత్సరంలో రచించిన విశాలాంధ్రలో ప్రజారాజ్యం నేటికి ప్రాసంగిత కలిగి ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర నీటిపథకం గ్రంధాన్ని ప్రామాణికంగా, ఇంజనీర్లు పరిగణిస్తూవున్నా రని, ఆయనకున్న విజన్, ముందుచూపుకు నిదర్శనాలని చెప్పారు. ఆయన రచించిన తెలంగాణా సాయుధ ప్రజా పోరాటం గుణపాఠాలు చైనా భాషలో అనువదించి కాపీలు అక్కడి ప్రభుత్వం కార్యకర్తలకు అందించిందని చెప్పారు. సుందరయ్య అంతర్జాతీయ ఖ్యాతి గడించారని పేర్కొన్నారు. ప్రజాపోరాటాలే కాకుండా సుందరయ్య నిష్కళంక రాజకీయవేత్త అని కొనియాడారు. కష్టజీవుల రాజ్య స్థాపనకు, దోపిడీ పీడన లేని సమాజ నిర్మాణానికి కృషి చేయడమే మనం ఆయనికచ్చే నివాళి అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు లక్ష్మణరావు, ఉమామహేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు యం.సాంబిరెడ్డి, దాల్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటసుబ్బయ్య, ఈశ్వరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ రెడ్డి కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కంజుల సత్యనారాయణ రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎన్జీఓ కాలనీలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో మొదలైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సత్య నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులు, వైసీపీ శ్రేణులు సంయుక్తంగా 10లక్షల పారి జాత పుష్పాలతో తొలుత స్వామి వారిని విశిష్ట అర్చనలు, అభిషేకాలతో ప్రసన్నం చేసుకున్నారు. అనం తరం 101 కొబ్బరికాయలు కొట్టి స్వామి వారిని సేవించారు. ఉదయం, సాయంత్రం విధిగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల నామధేయాలు ఉచ్చరిస్తూ వారిని తిరుగులేని ఆధిక్యంతో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని వేనోళ్లా వేడుకున్నారు. కంజుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలన్నా పేదరిక నిర్మూలన జరిగి నవసమాజ నిర్మాణం జరగాలన్నా మళ్ళీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టి.వెంకటేశ్వరరెడ్డి, బలరామిరెడ్డి, కంజుల సూర్య కుమారి, విజయలక్ష్మీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య పాటల పోటీలు

విశాలాంధ్ర-తెనాలి : శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తనా సేవాబృందం వారి ఆధ్వర్యంలో ఆదివారం బోసురోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో అన్నమయ్య పాటల పోటీలు జరిగాయి. అన్నమాచార్యుల వారి 616వ జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీలలో ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలబాలికల్లో భక్తి భావం పెంపొందించేందుకు నిరంతరం ఈ సంస్థ కృషిచేస్తుందని ఆ లక్ష్యంతో పాటల పోటీలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. అన్నమాచార్య సంకీర్తనల ప్రచారం నిరంతరం జరుగుతుందన్నారు. అన్నమాచార్య జీవితవిశేషాలను వివరించారు. న్యాయనిర్ణేతలుగా విజయవాడ అల్ ఇండియా రేడియో అనౌన్సర్, న్యూస్ అసిస్టెంట్ ఎడిటర్, మ్యూజిక్ డిప్లమా టీచర్, కె.ఎన్.పూర్ణచంద్రిక వ్యవహరించారు. కొండపి వసుంధర, లక్కరాజు కనకదుర్గ న్యాయనిర్ణేతలకు సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో సభ్యులు అందె బాలచంద్రమౌళి, పెరవలి వంశీకృష్ణ, రమాదేవి, రజిని, శాంతి రాజేశ్వరి పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు

- ▲ విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు
- ▲ నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు
- ▲ జిల్లా ఎస్పీ తుషార్ దూడి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో చుట్టు పక్కల ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తుషార్ దూడి తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పెట్రోల్ బంక్‌లలో ఎన్నికల కమీషన్ నియమావళి ప్రకారం పెట్రోల్, డీజిల్‌లను విడిగా బాటిల్స్‌లో పోయడం నిషేధమని, ఏ పెట్రోల్ బంక్ వారు అయిన రూల్స్ పాటించకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి జిల్లాలో ఎలాంటి ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీ లకు అనుమతి లేదని, ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో బాణసంచాలు నిల్వ ఉంచే కేంద్రాల్లో పోలీసు అధికారులు, ఫైర్ అధికారుల సమన్వయంతో బాణసంచాల గోడౌన్‌లను తనిఖీలు నిర్వహించాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో, ముఖ్య ప్రధాన కూడళ్లలో పోలీసు పికెట్లతో కూడిన బందోబస్తును ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఇంకా పలు సూచనలు చేశారు:

◆ ఎన్నికల కోడ్, సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉన్నందున ఏ ప్రాంతంలో కూడా నలుగురు కన్నా ఎక్కువ మంది ఒక చోట గుమికూడి ఉండరాదు. బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదు.

◆ ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులను/కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయటం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం /వదంతులను పెట్టి ప్రచారం చేయటం నేరం. అలా రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

◆ అనుమతులు లేకుండా బాణాసంచా కాల్చటం, ఇతర పార్టీ అభ్యర్థుల/కార్యకర్తల ఇంటి ముందు కవ్వించే విధంగా బాణాసంచా కాల్చి రెచ్చగొట్టే విధముగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

◆ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

◆ యువత బైకులకు సైలెన్సర్లు తీసి, ఎక్కువ శబ్దం చేస్తూ బైకులను నడిపే వారిపై కేసులు నమోదు చేసి, బైకులు స్వాధీనం చేసుకొని, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

◆ గ్రామాలలో ఎవరైనా అనుమానంగా తిరిగినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన, పోలీస్ వారికి వెంటనే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

◆ ఎన్నికల కమీషన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రజలందరూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ వారికి సహకరించి, ముందస్తు సూచనలు, సలహాలు పాటించాలని జిల్లా ఎస్పీ తుషార్ దూడి కోరారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగించాలి

విశాలాంధ్ర-తాడికొండ : చిరస్మరణీయులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం సుందరయ్య 39వ వర్ధంతి జరిగింది. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడారు. భూస్వామ్య ధనిక కుటుంబంలో జన్మించిన సుందరయ్య దేశానికి ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. కార్మిక, కర్షక, వ్యవసాయ, రైతాంగ, పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. ఆయన ఆశయాలను కొనసాగించవలసిన ఆవశ్యకత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు చింతల భాస్కరరావు, కె.పూర్ణచంద్రరావు, బాణావత్ భద్రయ్య, ఇమ్మడి రామా రావు, సంకురు రాజు, జోజి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రపంచ నాయకుడు హోచిమిన్ చిరస్మరణీయులు

విశాలాంధ్ర- తెనాలి : ప్రపంచ విప్లవ నాయకుడు, వియత్నాం దేశ పరిపాలనా దక్షుడు హోచిమిన్ జయంతి తెనాలి ఇస్కఫ్ హాలులో ఆదివారం జరిగింది. సభకు కొల్లిపర మండల ఇస్కఫ్ నాయకుడు తుంగా బాలస్వామి అధ్యక్షత వహించి మాట్లాడుతూ హోచి మిన్ సారధ్యంలో అమెరికా సామ్రాజ్య వాదులను ఎదుర్కొని కమ్యూనిస్టు దేశాన్ని నెలకొల్పారని చెప్పారు. అమెరికా సామ్రాజ్యవాదులతో నాడు నదీతీరంలో గృహాల్లో ఎన్నో కష్టాలు పడి వారిని ఎదిరించి వియత్నాంను కమ్యూనిస్టు పార్టీ దేశంగా మలిచారని ఆయనకు నివాళు లర్పించారు. సభలో ఇస్కఫ్ జాతీయ సభ్యులు రాష్ట్ర కార్యదర్శి బొల్లిముంత కృష్ణ వియత్నాంలో నేటికి ప్రజల జీవనవిధానం సుఖవంతంగా వుందని కమ్యూనిస్టు పార్టీ దేశంగా ప్రజలు సుఖసంతోషాలతో మెలగుతున్నారని చెప్పారు. వియత్నాం ప్రజారాజ్యంగా విలసిల్లుతుందని నేటి యువతరం వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సంక్షేమం కోసం సమాజ సేవ చేయాలన్నారు. గురజాడ రచించిన గేయంలో స్వంతలాభం కొంతమానుకో పొరుగువారికి తోడుపడవోయ్ అనే భావంతో మెలగాలని హితవు పలికారు. హోచిమిన్ జీవితవిశేషాలను వివరించారు. వియత్నాం దేశంలో కమ్యూనిస్టు పార్టీ పరిపాలనకు శ్రీకారం చుట్టిన మేధావిగా ఆయన ఆ దేశ ప్రజలకు చేసిన సేవలను వివరించారు. సాంస్కృతిక విభాగ కార్యదర్శి బెల్లంకొండ వెంకట్ మాట్లాడుతూ వియత్నాం దేశంలో సాంస్కృతికంగా కళలు అభివృద్ధి చెందాయని వాటిని గురించి వివరించారు. ఇస్కఫ్ సభ్యులు ఆలూరి సత్యేంద్రనాథ్, కాకుమాను గోపాలకృష్ణ, నాగరాజులు, శ్రీదేవి, బెజ్జంకి నాగమణి, విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమికి 155 సీట్లు ఖాయం

విశాలాంధ్ర-తాడేపల్లి : జూన్ 4వ తేదీన రానున్న ఎన్నికల ఫలితాల్లో టీడీపీ, ఎన్డీఏ కూటమికి 155 సీట్లు రావడం ఖాయ మని అలాగే 22 ఎంపీ స్థానాలు రావడం ఖాయమని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందర రావు యాదవ్, తెలుగు రైతు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కళ్ళం బాపిరెడ్డి అన్నారు. తాడేపల్లి కళ్ళం బాపిరెడ్డి కార్యా లయంలో విలేకరుల సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా దానబోయిన సుందరరావు యాదవ్ మాట్లాడుతూ వైసీపీకి కొన్నిప్రాంతాల్లో కనీసం డిపాజిట్లు కూడా రావన్నారు. రాష్ట్రంలో 85 శాతం ఓట్లు వేశారని అన్నారు. అలాగే మంగళగిరి నియోజకవర్గంలో 87 శాతం ఓట్ పర్సంటేజ్ రావడం చాలా గొప్ప విషయమని అన్నారు. నారా లోకేష్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి పేద ప్రజల పక్షాన నిలిచారని అన్నారు. మంగళగిరిలో నారా లోకేష్ 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తారని అన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఓటమి భయంతో మహానాడు జరపలేదని చెప్పడం చాలా సిగ్గుచేటని అన్నారు. వైసీపీ ఓటమి భయంతో బొత్స లాంటి కొంతమంది మంత్రులు ఈ విధంగా మాట్లాడుతు న్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్ని అరాచకాలు సృష్టించిన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని అన్నారు. కళ్ళం బాపిరెడ్డి మాట్లాడుతూ గతంలో నారా లోకేష్ ఓడిపోయినప్పటికీ ప్రెస్టేజ్‌గా తీసుకొని తన సొంత నియోజకవర్గంగా గడచిన ఐదు సంవత్సరాలలో ప్రజలతో మమేకమై అనేక రకాలైన సేవా కార్యక్రమాలు చేసి ప్రజలకు దగ్గరయ్యారన్నారు. మంగళగిరిలో నారా లోకేష్‌కి ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. మాచర్ల, పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, సత్తెనపల్లి ప్రాంతాలలో అనేక భయానక పరిస్థితులు సృష్టించారని విమర్శించారు. పెట్రోల్ బాంబులు, నాటు బాంబులు, కత్తులు, గొడ్డళ్ళు, వైసీపీలలో ఇళ్లలో దొరికాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజక వర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షులు బుర్రముక్కు శ్రీనివాసరెడ్డి, టీడీపీ తాడేపల్లి పట్టణ ఆర్గనైజర్ సెక్రెటరీ మండవ గోపాలరావు, సీనియర్ నాయకులు మున్నంగి సంజీవరెడ్డి, బత్తుల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య మార్గంలో పయనిద్దాం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య

విశాలాంధ్ర-తాడేపల్లి : సుందరయ్య మార్గంలో పయనిద్దాం.. సమాజాన్ని మారుద్దాం అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తొలి పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ తాడేపల్లి పట్టణంలోని మేకా అమరారెడ్డి భవన్‌లో వేముల దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో కృష్ణయ్య మాట్లాడుతూ సుందరయ్య గొప్ప ఆచరణవాదని అన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు నిలబడిన గొప్ప వక్తి అని కొనియాడారు. భూస్వాముల కుటుంబంలో పుట్టిన, నిత్యం పేదల కోసం, వ్యవసాయ కార్మికుల కోసం పనిచేసారని అన్నారు. తన ఆస్తీ మొత్తాన్ని పార్టీ నిర్మాణం కోసం త్యాగం చేసారని, అటువంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ 13న ముగిసిన ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, వైసీపీ ఓటమికి కృషి చేసిన కార్యకర్తలను అభినందించారు. సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. గెలిచిన, ఓడినా నిత్యం ప్రజల కోసం తన జీవితం అని అన్నారు. ఈ సభలో రూరల్ మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, ఐద్వా నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, నాయకులు గాదె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి కృష్ణయ్య పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర-మంగళగిరి : 25 ఏళ్ల తర్వాత చదువులమ్మ తల్లి వడిలో మరోసారి కలిసి చిన్ననాటి జ్ఞాపకాలు, అల్లర్లు గుర్తు చేసుకుంటూ... తమను ఎంతో ఉన్నతులుగా తీర్చిదిద్దిన గురువర్యులను సత్కరించుకొని మరోసారి వారి ఆశీస్సులు తీసుకున్నారు. వివరాలు చూద్దాం. మంగళగిరి సీకే బాలుర హైస్కూల్లో ఆదివారం హైస్కూల్లో 1994 నుంచి 1999 వరకు ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. 220 మంది పూర్వ విద్యార్థులకు గాను 110 మంది విద్యార్థులు సమ్మేళనంకు హాజరయ్యారు. ఎనిమిది మంది పూర్వ విద్యార్థులు వివిధ కారణాలతో మరణించారు. తొలుత ఆత్మీయ సమ్మేళనం ప్రారంభంలో తమతోపాటు విద్యనభ్యసించి గతించిన పూర్వ విద్యార్థులకు, విద్య నేర్పిన కొంతమంది మరణించిన ఉపాధ్యాయులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు పూర్వ విద్యార్థి రేఖా నరేష్ అధ్యక్షత వహించారు. సభలో తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను, నాటి నాన్ టీచింగ్ స్టాఫ్‌కు, ప్రస్తుతం హైస్కూల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ మంచా విజయమోహనరావు మాట్లాడుతూ 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకచోట కలిసి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిపి, నాటి ఉపాధ్యాయులను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని, తమ తమ భావాలను వ్యక్తపరచుకుంటూ జరిగిన ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థులకు మరిచిపోలేని ఓ మధురానుభూతిని ఇస్తుందన్నారు. నాటి విద్యార్థులు నేడు వివిధ రంగాలలో స్థిరపడిన వారందరూ తమ వృత్తులలో అభివృద్ధి చెంది సుఖసంతోషాలతో కాలం గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాడు విద్య నేర్పిన గురువులు జంజనం పాండురంగా రావు, దామర్ల కనకలింగేశ్వరరావు, అత్తోట రత్నబాబు, గోలి యోగేశ్వరరావు, గద్దె నరసింహారావు, రావుల సైదులు, కోర అమ్మాజీ, తుమ్మ నాగేశ్వరరావు, కాట్రు రామా రావు, ఎస్.రామ హనుమాన్, పంచల సాంబశివ రావు, పూర్వ విద్యార్థులు జంజనం సతీష్, మద్దెల కిషోర్, చాన్ భాషా తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు హైస్కూల్ ఆవరణలో గురువులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ

విశాలాంధ్ర-ఫిరంగిపురం : గుంటూరు ఉమ్మడి జిల్లాలో గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. ఫిరంగిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ తరువాత హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని, వీటిలో దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని అన్నారు. జూన్ 4వ తేది కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు, టపాసులు కాల్చడం పూర్తిగా నిషేదించడం జరిగిందని అన్నారు. 4వ తేది వరకు ఎన్నికల కమీషన్ కోడ్ నిబంధనలు విధించిందని, ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఎన్నికల కోడ్ జూన్ 6వ తేది వరకు అమలులో ఉందని, కోడ్ ఉన్న సమయంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ నోడల్ ఆఫీసర్, సీఐ వీరేంద్ర కుమార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో సుందరయ్యకు నివాళి

విశాలాంధ్ర-తాడేపల్లి : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉండవల్లి సెంటర్ సీపీఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు ఈమని రామారావు, వల్లభపురం వెంకటేశ్వరరావు, కొర్రప్రోలు ఈశ్వరెడ్డి, సీహెచ్ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు కవాతు

విశాలాంధ్ర-తుళ్లూరు : మండలంలోని సమస్యాత్మక ప్రాంతమైన పెదపరిమిలో ఆదివారం పోలీసు కవాతు జరిగింది. తమిళనాడు పోలీసులు స్థానిక పోలీసులు కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో కవాతు జరిపారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని, ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా తగు సంయమనం పాటించాలని సూచించారు. సీఐ అనూరాధ, ఎస్సైలు పాల్గొన్నారు.

టపాసులు విక్రయించకూడదు

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కౌటింగ్ రోజున జూన్ 4వ తేదీన అధిక మొత్తంలో టపాసులు అమ్మకం చేయకూడదని ఆదివారం సాయంత్రం తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉండవల్లిలోని టపాసుల గోడౌన్ యజమానికి నోటీసులు అందచేశారు.

ఇంటర్‌లో ఎంచుకునే గ్రూప్స్ పైనే విద్యార్థి భవిష్యత్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇంటర్మీడియట్‌లో ఎంచుకునే గ్రూప్స్ పైనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని హోప్‌విన్ హాస్పిటల్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తాన అన్నారు. వరంగల్ హన్మకొండలో ఉన్న షాహీన్ జూనియర్ కళాశాలలో '10వ తరగతి పూర్తయిన విద్యార్థులకు ఏ కోర్సు చేస్తే ఉపాధి అవకాశాలు లభిస్తాయి'అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ షమ సుల్తాన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అవగాహన అనేది ప్రామాణికమని అన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి ఇప్పటి వరకు చదివింది ఒక ఎత్తైతే ఇప్పటి నుంచి చదవటం అనేది ఓ మైలు రాయిలాంటిదని సూచించారు. వివేకంతో ఆలోచించి గ్రూప్స్‌ను ఎంపిక చేసుకోవడంపైనే వారి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. మీ మంచి చదువుతోనే ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొంది ఆర్థికంగా స్థిరపడవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖదీర్, వరంగల్ షాహీన్ కళాశాల ప్రిన్సిపల్ జి.రత్తయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐనవోలులో కంటి వైద్యశిబిరం



విశాలాంధ్ర-తుళ్లూరు : రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండల పరిధిలోని ఐనవోలులో ఆదివారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చి సహకారంతో మందడంలోని హాసిని సూపర్ స్పెషాలిటీ కంటి వైద్యశాల వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య పరమైన సూచనలు చేశారు. సుమారు 150 మంది వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందారు. చర్చి ఫాదర్ ఐజాక్ సామియేలు, వైద్య సిబ్బంది షేక్ భాషా, కిషోర్, ప్రియాంక, నిర్మల, కె.పున్నారావు పాల్గొన్నారు. ఆరోగ్య శ్రీ కార్డు కలిగి ఉన్నవారికి మందడంలోని హాసిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో కంటి శస్త్ర చికిత్సలు అందించడం జరుగుతుందని డాక్టర్ షేక్ రహీం భాషా తెలిపారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

శానంపూడిలో కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర-శావల్యాపురం : గ్రామాలలో గొడవలు సృష్టించే వారిపై ఘటన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సల్ల సురేష్ తెలిపారు. మండలంలోని శానంపూడి గ్రామంలో ఎస్ఐ చల్లా సురేష్ ఆద్వర్యంలో కార్డెన్ సెర్చ్ ఆది వారం నిర్వహించారు. గ్రామ ప్రజలకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఎటువంటి అల్లర్లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, ముఖ్య ంగా యువత ఇటు వంటి రాజకీయ అల్లర్లకు దూరంగా ఉండాలని సూచిం చారు. ఎస్ఐ మాట్లా డుతూ సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు, అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. గ్రామంలోని ఇళ్ళను, కొష్టాలు, గడ్డివాములను క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. కార్డెన్ సెర్చ్‌లో సరైన పత్రాలులేని 12 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కారంపూడిలో సిట్ బృందం పర్యటన

విశాలాంధ్ర-కారంపూడి : ఎన్నికల అనంతరం పట్టణంలో జరిగిన దాడులు, హింసాకాండపై ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ బృందం ఆదివారం పర్యటించి విచారణ చేపట్టింది. ఈ నెల 14వ తేదీన పట్టణంలో వైసీపీ నాయకులు రాడ్లు, కర్రలతో టీడీపీ పార్టీ కార్యా లయం, ప్రైవేట్ ఆస్తు లను ధ్వంసం చేశారు. పార్టీ కార్యకర్తల కారును తగలబెట్టారు. సీఐను గాయపర్చారు. ప్రతి చర్యగా టీడీపీ పార్టీ వారు దాడి చేశారు. ఈ క్రమంలో ఇరు పార్టీల వారు కేసులు నమోదు చేసుకున్నారు. దాడిలో పాల్గొన్న వైసీపీ పార్టీకు చెందిన 11 మంది, టీడీపీ పార్టీకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. పట్టణంలో జరిగిన ఎన్నికల అనంతర ఘటనలపై సిట్‌బృందం పట్టణ పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను సీఐ నారాయణస్వామి నుంచి సేకరించారు.

బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దు : ఈసీ

విశాలాంధ్ర-నరసరావుపేట : క్యాన్లు, బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దని పెట్రోల్ బంక్ నిర్వాహకులను ఈసీ ఆదేశిం చింది. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాహ నాల్లో మాత్రమే ఇంధనం నింపాలని స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయిల్ బంకుల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించింది. అన్ని బంకుల యజమాను లకు నోటీసులు పంపింది. పోలింగ్ తర్వాత పల్నాడు జిల్లాలో పలుచోట్ల హింసాత్మక ఘర్షణల నేపథ్యంలో ఈసీఈ ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

ఇంటర్నేషనల్ క్యాండిల్ మెమోరియల్ డే

విశాలాంధ్ర-నరసరావుపేట : హెచ్ఐవీతో బాధపడుతూ చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలనే ఉద్దేశంతో ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నేషనల్ క్యాండిల్ మెమోరియల్ డే కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నరసరావుపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా డిఎల్ఏటీఓ డాక్టర్ మురళీకృష్ణ కొవ్వొత్తుల ర్యాలీ ప్రారం భించారు. స్థానిక డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ క్యాండిల్ మెమోరియల్ డే 1986వ సంవత్సరం నుండి 38 సంవత్సరాలుగా ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. హెచ్ఐవితో బాధపడు తున్న వారందరికీ మేమున్నాము అనే ధైర్యాన్ని ఈ క్యాండిల్ ర్యాలీతో కల్పిస్తు న్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏపిఎస్ఏసీఎస్ ఆధ్వర్యంలో హెచ్ఐవితో జీవిస్తున్న వారందరికీ ఉచిత వైద్యంతో పాటు, ఆర్థిక, సామాజిక సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అర్ఎంఓ డాక్టర్ దయానిధి, ప్రోగ్రాం మేనేజర్ మధుసూదనరావు, హెచ్ఓసి, పీఎం ఉదయ్‌కుమార్, గౌస్, రీట్స్ కోమలి, క్యాంప్ రోహిణి, ప్రతినిధులు, పల్నాడులోని అన్ని ఎన్జీఓ సభ్యులు పాల్గొన్నారు.

రెండు గ్రామాలల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర-రెంటచింతల : సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో జరిగిన అల్లర్లకు పోలీసులు చెక్ పెడుతున్నారు. గ్రామాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం పోలీసులు మండలంలోని రెంటాల, తుమ్మకోట గ్రామాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. గ్రామంలో మారణాయుధాలు, నాటు బాంబులు ఏమైనా ఉన్నాయో అని సోదాలు నిర్వహించారు. అయితే ఎక్కడకూడా ఎటువంటి మారణాయుధాలు దొరకలేదని పోలీసులు తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి అల్లర్లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, ముఖ్యంగా యువత ఇటువంటి రాజకీయ అల్లర్లకు దూరంగా ఉండాలని ఎస్సై ఎం.ఆంజనేయులు హితవుపలికారు.

మెరిట్ స్కాలర్‌షిప్ అందజేత

విశాలాంధ్ర-పెదకూరపాడు : మాగు లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ మాగలూరి సహకారంతో. మండల పరిధిలోని కాశిపాడు గ్రామానికి చెందిన జోసఫ్ కుమార్తె సంతోషం (97శాతం విద్యార్థినికి మెరిట్ స్కాలర్షిప్ కింద రూ.2వేలు ఆర్థిక సాయం అందించినట్లు ప్రవాస భారతీయుడు ఎన్నారై నిర్వాహకులు మాగులూరి ఫౌండేషన్ చైర్మన్ మాగులూరి భాను ప్రకాష్ మాట్లాడుతూ పేద విద్యార్థిని విద్యార్థులకు వారి భవిష్యత్తు కొరకు ఆర్థిక సహాయం స్కాలర్షిప్లు అందిస్తున్నామని అన్నారు.

కొనసాగుతున్న సిట్ బృందం విచారణ

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లాలో ఎన్నికల సందర్భంగా జరిగిన అల్లర్లు, ప్రతిదాడులకు సంబంధించి వివిధ పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసులపై, సంబంధిత అధికారులు చేపట్టిన చర్యలపై సిట్ అధికారుల బృందం రెండు రోజులుగా విచారణ నిర్వహిస్తుంది. పల్నాడు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు జరిగినా రోజు మరుసటి రోజు పెద్ద ఎత్తున అధికార, ప్రతిపక్ష నాయకుల ఆధ్వ ర్యంలో దాడులు, ప్రతిదాడులు జరి గాయి. ఈ దాడులను అరికట్టడంలో పోలీస్ అధికారులు పూర్తిగా విఫలమ య్యారు. దీంతో ఈ సీఐ జిల్లా కలెక్టర్‌ను ట్రాన్స్ఫర్ చేసి ఎస్పీతో పాటు ఇద్దరు డిఎస్పీలు, ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలను సస్పెండ్ చేసి వారిపై బృందంతో విచారణకు ఆదేశించింది. ఈ నేపద్యంలో సిట్ అధికారుల బృందం శనివారం నరసరావుపేటకు చేరుకుని పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్లో విచారణ చేపట్టింది. అనంతరం కారం పూడి, మాచర్ల, రెంటచింతల, వెల్దుర్తి, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం పోలీస్ స్టేషన్‌లలో సిట్ అధికారులు ఆదివారం రికార్డులు తనిఖీ చేసి, అధికారులను విచారించారు. గురజాల నియోజకవర్గంలో పోలీసులు వందకు పైగా కేసులో 192 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అత్యధికంగా దాచేపల్లి మండలం 70, పిడుగురాళ్ల మండలం 62 మందిపై కేసులు నమోదు చేశారు. పిడుగురాళ్ల మండలంలో 67 మందిపై ఐపీసీ 307, 324, 323 కింద కేసు నమోదు చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో 34 కేసులో 70 మంది నిందితులుగా గుర్తించారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 5 కేసులు నమోదు చేసి 99 మంది నిందితుల గుర్తించారు. నరసరావుపేట నియోజకవర్గంలో 20 పైగా కేసుల్లో 60 మంది నిందితుల గుర్తించారు. నరసరావుపేట వన్ టౌన్‌లో జరిగిన గొడవలకు సంబంధించి 11 మందిపై ఐపీసీ 147, 148, 324 కింద కేసు నమోదు చేశారు. నమోదైన ఎఫ్ఆర్‌లలో మరికొన్ని పేర్లు చేర్చే అవకాశం అంద రికి సమాచారం. కారంపూడిలో జరిగిన దాడుల్లో సుమారు 22 మందిని అరెస్ట్ చేశారు. మరి కొంతమంది పరారీలో ఉన్నట్టు తెలుస్తుంది. పల్నాడులో ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనలపై సిట్ బృందం ఈసీఐకి నివేదిక అందజేస్తుంది. సిట్ బృందం నివేదిక ఆధారంగా అధికార పార్టీకి కొమ్ము కాసిన పోలీస్ అధికారులపై ఈసిఐ కఠిన చర్యలు చేపట్టే అవకాశం ఉందని సమాచారం.

నిజాయతీకి మారుపేరు సుందరయ్య

విశాలాంధ్ర-శావల్యాపురం : ప్రజాప్రతినిధులు నిజాయి తీగా ఎలా ఉండాలో ఆచరణలో రుజువు చేసిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని శావల్యాపురం సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు, కుల, మత, రాజకీయాలకు భిన్నంగా పేదల పక్షాన నిలిచి వారికి మేలు చేసిన వ్యక్తి సుందరయ్య అని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్ని కల్లో పోటీ చేస్తున్న ప్రధాన అభ్యర్థులు ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పకుండా డబ్బు, మద్య ంతో ఓటర్లను ప్రలోభ పెట్టారని తెలిపారు. సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్, బోయపాటి వెంకట రాయుడు, గణపర్తి వెంకటేశ్వర్లు, దుగ్గెంపూడి చిన్న వెంకయ్య, సూరాబత్తుని గోవింద రాజులు, పచ్చవ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలేయ, జీర్ణకోశ వ్యాధులకు నేడు అత్యాధునిక వైద్యం

- ఆరోగ్య సభలో గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ సిద్ధార్థ రెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కాలేయ, జీర్ణకోశ వ్యాధులకు నేడు అత్యాధునిక వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్ధార్థరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'లివర్, జీర్ణకోశ వ్యాధులు' ఆరోగ్య సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ గ్యాస్ సమస్య నివారణ మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు. వయసుతో సంబంధం లేకుండా ఎక్కువ మంది ఎదుర్కొంటున్న గ్యాస్ట్రిక్ సమస్యను ప్రామాదకరమైంది కాదని, నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. మానవుని జీర్ణ వ్యవస్థకు సంబందించి ముఖ్యంగా అన్నవాహిక పొట్ట, చిన్నప్రేగులు, పెద్ద ప్రేగులు జీర్ణక్రియలో ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. అన్నవాహికకు జీఈఆర్‌డీ సమస్య, కార్సినోమా సమస్య ఉత్పన్నమవుతాయని, జీఈఆర్‌డీ సమస్యతో బాధపడేవారు పులుపు కలిగిన పండ్లను, చాక్లెట్లు, టమాట, వెల్లుల్లి, ఉల్లి, వేయించిన వస్తువులు, కూల్‌డ్రింక్స్, ఫ్యాటీఫుడ్స్, ఆల్కాహాల్ వంటి వాటిని తీసుకోవడం మంచిదికాదన్నారు. తిన్నవెంటనే పడుకోరాదని, తక్కువ ఆహారం ఎక్కువసార్లు తీసుకుంటే మంచిదని సూచించారు. బరువును అదుపులో ఉంచుకోవాలని, అన్నవాహికకు కార్సినోమా, అన్నవాహికకు అనుసంధాన ంగా ఉన్న పొట్టలో మనం తీసుకునే ఆహారం జీర్ణం అయ్యేందుకు కావాల్సిన జీర్ణ రసాలతో మనం తీసుకునే ఆహారం మెత్తగా అయ్యే ప్రక్రియ జరుగుతుంద న్నారు. ఆరోగ్యకరమైన లివర్ మంచి ఎరుపు రంగులో ఉంటుందని, లివర్‌లో సమస్య ఉత్పన్నమై అది చిన్నదైతే లివర్ పసుపు రంగులో మారుతుందని హెచ్చరించారు. లివర్ ఆరోగ్య స్థితి తెలుసు కునేందుకు ఫైబ్రో స్కాన్ అనే విధానం అందుబాటులో ఉందని, ఈ స్కాన్ ద్వారా మన లివర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరాం, రామ చంద్రరావు, శివ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతను పెంచేలా ఉద్యోగుల సమన్వయ కమిటీ కృషి

- ఉద్యోగుల సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ప్రజాస్వా మిక స్పృహను కలిగించటంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించేలా ఉద్యోగుల సమన్వయ కమిటీ దశాబ్దాలుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో కృషి చేస్తుందని ఆ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయం సమావేశ మందిరం సూర్యారావు ప్రాంగణ ంలో ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి సమావేశం నిర్వహించారు. 'ముందు మనం మానవులం, పౌరులం, ఆ తర్వాతే ఉద్యోగులం' అనే పుస్తకాన్ని విరసం రాష్ట్ర నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో శాస్త్రీయ సోషలిజాన్ని ప్రచారంతో పాటు ఆచరింప చేయటం ద్వారానే దోపిడీ రహిత సమ సమాజాన్ని నెలకొల్పేలా ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు పద్మజ షా 'సామాజిక బాధ్యత' అంశంపై..ఏఎన్‌యూ ప్రొఫెసర్ జి.అంజిరెడ్డి 'భారత రాజ్యాంగం-బీజేపీ వైఖరి' అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భ ంగా ఉద్యోగుల సమన్వయ కమిటీ జేఏసీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చైర్మన్ జీడీ హనుమంత రావు 'ఉద్యోగ వికాసం' పత్రిక ఆవిష్కరణ గావించారు. ప్రజా గాయకులు గని, బెన్జర్ బాబులు పాడిన అభ్యుదయ చైతన్య గీతాలు అలరించాయి. డీఆర్ మంజుల సభకు స్వాగతం పలుకగా కార్యక్రమంలో సమన్వయ కమిటీ కార్యదర్శి ఎస్ఎస్ గాంధీ ఉద్యోగ వికాసం పత్రిక ప్రధాన సంపాదకులు ఎన్వీ నరసింహారావు, టి.శ్రీనివాసరావు, ఉద్యోగ క్రాంతి సంపాదకులు ఎస్.వెంకటేశ్వర్లు, కో-ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి జీ.హనుమం తరావు, పలువురు ప్రజా ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భావ సాహిత్య కవి ఎస్ఏ రవూఫ్

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్

విశాలాంధ్ర-గుంటూరు : సుప్రసిద్ధ విమర్శకులు సుదర్శనం అన్నట్లు డాక్టర్ రవూఫ్ రచనల్లో పద్య నిర్మాణంలో సహజత్వంతో, రమణీయంగా, ఆలోచనలను రేకిస్తాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక బృందావన్ గార్డెన్స్ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయం ఆవరణలో ప్రముఖ రచయిత డాక్టర్ రవూఫ్ కలం నుంచి జాలువారిన డాక్టర్ కవితా సంపుటి జాబిల్లి పుష్పం పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేసిన డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ కవి తన కవిత్వం ద్వారా తాను చెప్పదలుచుకున్న భావాలను సూటిగా హృదయాలను తాకేటట్లు ఉండాలన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుప్రసిద్ధ కవి డాక్టర్ ఇస్మాయిల్ వారసునిగా గత నాలుగు దశాబ్దాలుగా సాహితీ ప్రస్థానంలో డాక్టర్ రవూఫ్ ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. ప్రముఖ రచయిత కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ తన కలం ద్వారా కవిత్వాన్ని సృష్టిస్తే అది రసజ్ఞుల హృదయాల లోతులను సృజిస్తాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీ దేవి మాట్లాడుతూ కవితా సంపుటి జాబిల్లి పుష్పంలో జాబిల్లి అనేకానేక శాఖల పుష్పంగా మారి గుబాళిస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్ బుద్ధుని బోధనలు సమాజానికి ఆదర్శం

విశాలాంధ్ర-మంగళగిరి : తల్లిదండ్రుల కన్నా తన బంధువుల కన్నా తన మనసు కూర్చిన మేలే మిన్న అన్న గౌతమ బుద్దుని బోధనలు ఈ సమాజానికి ఆదర్శం అని మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు అన్నారు. 2568వ జయంతి వేడుకలను మంగళగిరి గౌతమబుద్ధ రోడ్డులోని వైష్ణవి కళ్యాణ మండప ంలో ఈ నెల 23వ తేదీన సాయంత్రం 6 గంటలకు వైభవంగా మానవతా వేదిక ఆధ్వర్యంలో నిర్వహి ంచనున్నట్లు తెలిపారు. మంగళగిరి నగరంలోని పొట్లాబత్తుని వెంకటేశ్వరరావు కళా నిలయంలో ఆదివారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. బుద్ధ పూర్ణిమ వేడుకలను ప్రతిఒక్కరూ విజయ వంతం చేయాలని సమావేశంలో పాల్గొన్న మంగళగిరి బుద్ధ విహార అధ్యక్షులు రేఖా కృష్ణార్జునరావు, విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, పిరమిడ్ సేవాదళ్ కార్యదర్శి ఆకురాతి శంకరరావు కోరారు. ఈ సమావేశంలో అలక తాతారావు, సందుపట్ల భూపతి, చిలకా వెంకటేశ్వరరావు, అందే వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన సుందరయ్య

విశాలాంధ్ర-మంగళగిరి : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా కాజా గ్రామంలో పాల కేంద్రం వద్ద గల సుందరయ్య విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కె.హరి కిషోర్ మాట్లాడుతూ జీవితాంతం పేదల కోసం సర్వస్వం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం కోసం, ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర నీటి పథకం వంటి అంశాలపై సుదీర్ఘంగా పుస్తకాలను రూపొందించారని ఆ పుస్తకాలే నేటి పాలకులకు ఆధారంగా మారాయన్నారు. అంటరానితనాన్ని రూపుమాపడానికి నిరంతరం కృషి చేశారని చెప్పారు. పార్టీ నిర్మాణానికి, ఎందరో నేతలను తీర్చిదిద్దిన ఘనత ఆయనదేనని తెలిపారు. బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన వివిధ ప్రదర్శనలకు ఉగాది సందర్భంగా బహుమతులను గెలుచుకోగా వారిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.కోటేశ్వరి, ఈదా ప్రతాపరెడ్డి, ఎస్.విజయ లక్ష్మి, నిర్మల, తమ్మా ప్రసాదరెడ్డి, అప్పికట్ల ప్రకాశరావు, సుమ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

విశాలాంధ్ర-వినుకొండ : ప్రతి నెలా ఆర్థికముగా వెనుక బడిన బ్రాహ్మణ కుటుంబములను వినుకొండ బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో జీవి ఆదివారం మాధవరావు ఆఫీస్ నందు బియ్యం, నూతన వస్త్రాలు బహుకరణ చేశారు. దాతలు అయిన చింతల చెర్వు రాఘవేంద్రరావు, పుట్టంరాజు నారాయణరావు, బొడ్డుచర్ల ప్రసాద్ వామరాజు రామారావు, పాలుట్ల కమల కుమారి కుందుర్తి సత్య నారాయణ, గోపాలుని నాగమణి, నాగరాజు, సిరిపురపు రాధా కృష్ణ మూర్తిల సహాయ సహకారాలతో, బియ్యం, నూతన వస్త్ర బహుకరణ చేశారు. ఈ కార్యక్రమంలో బాగవతుల రవికుమార్, పోలూరి సుబ్బా రావు, దారా రామమూర్తి, ధూళిపాళ్ళ నాగేశ్వరావు, ధూళిపాళ్ళ వెంకటే శ్వర్లు, సీహెచ్.ఎం.వి.శర్మ, గోపాలుని నరేష్, బొగ్గరం బుచ్చి రాజు తదితరులు హాజరై నిర్వీరామంగా గత 88 నెలలు నుండి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న, గోగులపాటి వెంకట మాధవరావును అభినందించారు.

గుండెపోటుతో టీడీపీ నాయకులు మృతి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని గారపాడు గ్రామానికి చెందిన మన్నెం వెంకటేశ్వరరావు గుండెపోటుతో పెదకూరపాడు గ్రామానికి చెందిన అత్తిపట్ల సామ్రాజ్యం మండల పరిధిలోని పరస గ్రామానికి చెందిన సరిపుడి శ్రీనివాసరావు అనారోగ్యముతో ఆదివారం మృతిచెందగా పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ వెంకటేశ్వరరావు భౌతికకాయన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ 1983 నుండి ఆనాటి నుండి ఈనాటి వరకు తెలుగు దేశం పార్టీ కార్యకర్తగా నాయకుడిగా ఎదిగిన వెంకటేశ్వరరావు మృతి చెందటం బాధాకరమని శ్రీధర్ అన్నారు. నివాళులర్పించిన వారిలో సత్తెనపల్లి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెనుమంచు రామారావు, మండల పార్టీ అధ్యక్షులు అత్తిమల రమేష్, నీటి సంఘం మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మక్కెర సాగర్, మాజీ సర్పంచి నంబూరు నాగేశ్వరరావు, అంద్ర కొండలరావు, గంగాధర్, అమరయ్య బెల్లంకొండ, రాంగోపాలరావు తదితరులు ఉన్నారు.

ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు ఈ నెల 22లోగా ధరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.రవినాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరము విద్య అభ్యసించే విద్యార్థులు ధరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 22న ఆఖరు తేదీగా నిర్ణయించామని అన్నారు. తమ కళాశాలలో ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపులు ఉన్నాయన్నారు. ఆయా గ్రూపులకు ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధన జరుగుతుందన్నారు. ఆడపిల్లలకు హాస్టల్ వసతి సౌకర్యం ఉందని అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ంలో పైన తెలిపిన గ్రూపులలో విద్య అభ్యసించేందుకు పదవతరగతి ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. పదవ తరగతిలో వచ్చిన మెరిట్ మార్కులు, ప్రభుత్వం వారి రిజర్వేషన్లు అనుసరించి సీట్లు కేటాయిం చడం జరుగుతుందని అన్నారు. ఆన్‌లైన్‌లో ఏపీఎంఎస్. ఏపీసీఎఫ్ ఎస్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు కాలేజీలో సంప్రదించాలని కోరారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర - తుళ్ళూరు: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకు న్న ఘటన ఆదివారం రాత్రి తుళ్ళూరులో చోటుచేసుకుంది. రాయపూడి గ్రామానికి చెందిన సుకన్య (26), విజయ్ బాబుకి గత 3 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం అయ్యింది. గత కొంతకాలంగా అత్త, మామలు కట్నం కోసం వేదింపులకు గురిచేస్తున్నారని మృతురాలి చెల్లి తెలిపింది. ఈ నేపథ్యంలో తుళ్ళూరులోని పుట్టింటికి వచ్చి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తుళ్ళూరు గ్రామానికి చెందిన గొడవర్తి డేవిడ్‌పెద్ద కుమార్తె, మృతురాలికి 7 నెలల పాప ఉంది. తుళ్ళూరు సీఐ అనురాధ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సుష్మితకు ల్యాప్‌టాప్ అందజేత

విశాలాంధ్ర-గన్నవరం : హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ బషీర్ గారి సహకారంతో ఇంజనీరింగ్ చదువుతున్న సుష్మితకు ఆదివారం నాడు ల్యాబ్టాప్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ చదువుకి పేదరికం అడ్డంకి కారాదని అప్పుడే సమా సమాజం ఏర్పడుతుందని ఆయన అన్నారు. చదువుకి పేదరికం ఎటువంటి పరిస్థితులలో అడ్డంకి రాకూడదని ఆయన అన్నారు. గతంలో కూడా కల్పన కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో సహకారం చేసామని వెంకట్ తెలిపారు. దాత బషీర్ కి,హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ కి సుష్మిత తల్లి కల్పన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లిలో పదెకరాల వరిగడ్డి వామి ఆదివారం దగ్ధమైంది. స్థానిక దళితవాడలో కొడాలి సురేష్ బాబుకు చెందిన పది ఎకరాల వరిగడ్డివామి తెల్లవారుజామున అగ్నికి ఆహుతైంది. వరి గడ్డి వామికి నలువైపులా మంటలు అంటుకోవటంతో పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అవనిగడ్డ అగ్నిమాపక అధికారులు సిబ్బందితో కలిసి వచ్చి మంటలను అదుపుచేశారు. పూర్తిగా దగ్ధం కావటంతో మధ్యాహ్నం వరకూ సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదనష్టం లక్ష రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా. ప్రమాద కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. కావాలనే ఎవరో వరిగడ్డి వామికి నిప్పుపెట్టినట్లు అనుమానిస్తున్నారు.

అన్నదానం

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : నేటి సమాజంలో సమాజ సేవలో ప్రభుత్వాల కంటే స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమైంది అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎల్ ఎస్ ఎస్ వి డి హనుమంతరావు అన్నారు. ఆదివారం లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో మచిలీపట్నం ముస్తా ఖాన్ పేట దేవుడు తోట ఎస్టీ కాలనీలో 250 మందికి అన్నదాన కార్యక్రమం, పళ్ళు పౌష్టికాహారాన్ని పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సాఫ్ట్వేర్ ఇంజనీర్స్ వర్దినీడి శ్రీకాంత్ లంకిశెట్టి దీప్తి, ఆశ్రిత సహకారంతో ఆకలితో ఉన్న ఎస్టీ కాలనీలో పేదవారికి ఆకలి తీర్చడం దేవుడు సేవతో సమానం అన్నారు. ప్రభుత్వ పరంగా ఎస్టీ కాలనీలు డెవలప్ చేయాలని వారికి కేటాయించిన నిధులు క్షేత్రస్థాయిలో వారికి అందే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ,లంకిశెట్టి నీరజ, తాడేపల్లి రమేష్, తన్మయి, తదితరులు పాల్గొన్నారు.